విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 10 ఏప్రిల్ 2025 8 పేజీలు

నేడు ఒంగోలుకు రామకృష్ణ రాక

విశాలాంధ్ర -ఒంగోలు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒంగోలు రానున్నారు. సీపీఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒంగోలులో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన అగ్రహారం భూములను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు, లబ్ధిదారులతో కలిసి పరిశీలించనున్నారు. అనంతరం రామకృష్ణ లబ్ధిదారులతో మాట్లాడి ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొంటారు.

జూలై నుంచి బోట్ షికార్

- సూర్యలంక రామాపురం బీచ్‌లను అభివృద్ధి చేస్తాం
- పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లా
- కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : జూలై నెలలో బోట్ షికార్ అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు, కన్సల్టెంట్‌లతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతం కానున్నదని కలెక్టర్ చెప్పారు. సూర్యలంక,రామాపురం బీచ్‌లను జూలై నెలలోగా పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని, కాలుష్యం లేని ప్రాంతంగా ఈ రెండు బీచ్‌లు ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే 20 మంది శాస్త్రవేత్తలు ఆ రెండు బీచ్‌లలో పర్యటించి,అధ్యయనం చేశారని వివరించారు. పరిశుభ్రమైన ప్రాంతంగా బాపట్ల జిల్లాలోని ఆ రెండు బీచ్‌లు ఉన్నాయన్నారు. రాజస్థాన్, గుజరాత్‌లోని పర్యాటక ప్రాంతాల మాదిరిగా తీర్చిదిద్దడానికి అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలో జీడి పప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తి ప్రదర్శనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తాటి చెట్ల ఆధారంగా ఉత్పత్తులు పెంచేలా కళ్ళు గీత కార్మికులకు, బోటింగ్ షికారు జరిగేలా మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు,ప్రదర్శనల కొరకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. వాడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు సంబంధించిన ఒక ఎకరా భూమిని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఏజెన్సీలకు ఆ భూమిని లీజ్ ఇవ్వడానికి పరిశీలనలు జరుగుతున్నాయన్నారు. పర్యాటకానికి ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేరలి కెనాల్ బోటింగ్‌కు అనువైన ప్రాంత కాగా పర్యాటకల కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. బీచ్‌ల వద్ద రిసార్ట్స్ నిర్వహణలపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అత్యవసరమైన అభివృద్ధి కొరకు రూ.1.13కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్,పర్యాటక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లజ్వంతి నాయుడు, కన్సల్టెంట్ సాహితీ దివి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రించాలి

- ఒంగోలు నగరంలో పశ్చిమ బైపాస్ అవశ్యం
- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి
- ప్రతిపాదనలపై కలెక్టర్, అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతో పాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్ళించేలా త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకూ పశ్చిమం వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు. సంబంధిత శాసనసభ్యులు అందరినీ సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ సంతనూతలపాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే హెవీ వాహనాల రాకపోకలను ప్రధానంగా నియంత్రంచాల్సి ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్)ను రూపొందించేటప్పుడు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలను రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఆర్అండ్‌బి ఎస్.ఈ. దేవానంద్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. బాల శంకరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళల భద్రతకు భరోసా

జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : మహిళ భద్రతకు భరోసా శక్తి యాప్ అని సేఫ్ మై ట్రావెల్ సదుపాయం వినియోగించుకుని సురక్షిత ప్రయాణం చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి బుధవారం జిల్లాలోని పోలీస్ సిబ్బందికి టెలికాన్ఫిరెన్స్ ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, రైల్వేస్టేషన్‌లలో, బస్టాండ్‌లలో,ప్రధాన కూడళ్లలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థినిలకు శక్తి యాప్ ఆవశ్యకతను గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, యాప్‌ను ఏవిధంగా మొబైల్ ఫోన్‌లలో డౌన్లోడ్ చేసుకొని ఇన్స్టాల్ చేసుకోవాలో వివరిస్తున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు విద్యార్థినులకు అత్యవసర సమయాలలో శక్తి యాప్ అండగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంటే ఉన్నట్లేనని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆపదలో చిక్కుకున్న మహిళలు, విద్యార్థినిలు యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. వారు వేగవంతంగా ఘటన స్థలానికి చేరుకొని మహిళలకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. దీనిలో హ్యాండ్ షేక్ అనే సదుపాయం ఉంటుందన్నారు. ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసే పరిస్థితులలో లేనప్పుడు మొబైల్ ఫోన్‌ను

మిగతా 2 లో ...

పోషణ పక్వాడపై అవగాహన ర్యాలీ

పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీలు, పాలిచ్చే తల్లుల పోషకాహార లోపాలను తగ్గించాలని కోరుతూ పొన్నలూరు మండల కేంద్రంలో బుధవారం అంగనవాడీ సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన పోషణ పక్వాడ కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు ఆశ, హరిత, సిహెచ్ఓ సుబ్బారావు, అంగన్‌వాడి కార్యకర్తలు.

-విశాలాంధ్ర, పొన్నలూరు :

విశాలాంధ్ర epaper.visalaandhra.com గురువారం 10 । ఏప్రిల్ । 2025

జగన్ అహంకారానికి నిదర్శనం పోలీస్ వ్యవస్థపై వ్యాఖ్యలు

గొట్టిపాటి లక్ష్మీ

విశాలాంధ్ర-దర్శి : ప్రతి పక్ష నేత వై ఎస్ జగన్ చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే పేరుతో జగన్ ఆడిన నాటకం, పోలీస్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య భావజాలానికి, అహంకారానికి నిదర్శనాలనే చెప్పాలని గొట్టిపాటి లక్ష్మి అన్నారు. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి, కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, స్థానిక నాయకుల సమస్యలు విని వారిలో భరోసా నింపాలి కానీ రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం, పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్ ను తలదన్నిందనే చెప్పాలి. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలే. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు, ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణబాధ్యతల్లో తలమునకలైన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా నిలిచాయి. మహిళా పోలీస్ అధికారులు ఆ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్నారని తెలిసీ జగన్ అలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. పోలీసులు సరిగా పనిచేయకపోతే జగన్ రాప్తాడులో స్వేచ్ఛగా పర్యటించి, యధేచ్ఛగా నోరు పారేసుకోగలిగేవాడా? తన పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్ద, పాపిరెడ్డి పల్లె చుట్టూ రక్షణగా నిలిచిన వందలమంది పోలీసులు జగన్ కు కనిపించలేదా? పోలీస్ వ్యవస్థ జగన్ తీరుని ఏమాత్రం ఉపేక్షించకూడదు. తమపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా జగన్ క్షమాపణ చెప్పేవరకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పోరాడాలి. ఆయన తన తప్పు తెలుసుకునేలా చేసి, పోలీసుల పవర్ ఏంటో తెలియచేయాలి. అప్పుడే మరోసారి వైసీపీ అధినేత ఒళ్లుతెలియకుండా వ్యవహరించడు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పోలీసుల్ని డ్యూటీ సక్రమంగా చేయమంటే, తమను ఏదో అన్నారని గొంతుచించుకున్న పోలీస్ అధికారుల సంఘం తక్షణమే జగన్ వ్యాఖ్యలపై న్యాయస్థానాల్ని ఆశ్రయించాలి. పరిణామాలు తెలిసొచ్చేలా కఠిన శిక్ష పడేలా చూడాలి. సాటి మహిళా పోలీస్ సిబ్బందిని దూషించిన వ్యక్తికి ఇప్పుడు బుద్ధిచెప్పకపోతే, అతన్ని ఆదర్శంగా తీసుకొని మునుముందు వైసీపీ శ్రేణులు రెట్టింపు మదంతో రెచ్చిపోతారనే వాస్తవాన్ని పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించాలని గొట్టిపాటి లక్ష్మి అన్నారు.

మెరిట్, రోస్టర్ విధానంలో పదోన్నతుల సీనియార్టీ జాబితా

విశాలాంధ్ర-ఒంగోలు : మే నెలలో జరగబోయే ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితాలో మెరిట్ కం రోస్టర్ విధానంలో తయారు చేయకుండా తప్పుడు తడకలతో ఉన్న ఈ సీనియార్టీని ఫ్యాప్టో అంగీకరించదని అలా తయారు చేయని పక్షంలో ఫ్యాప్టో తరపున ఉద్యమం చేపట్టవలసి వస్తుందని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ హెచ్చరించారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎర్రయ్య మాట్లాడుతూ గతంలో జరిగిన పదోన్నతుల ప్రకారము సీనియార్టీ లిస్టును తయారు చేయటం జిఓ నంబర్ 64కి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్ఎండి. రఫీ, కో ఛైర్మన్లు వి.మాధవరావు, డి.జయ రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ అబ్దుల్ హై, వి.జనార్దన్ రెడ్డి, బి.వెంకట్రావు, సెక్రటరీ వై.వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసులు, వీరాంజనేయులు, కే.శ్రీనివాసులు, చల్లా శ్రీనివాసులు, ఎస్.రవి, పర్రె వెంకట్రావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్యూబాకు సంఘీభావనిధి వసూలు

విశాలాంధ్ర- చీమకుర్తి: అమెరికన్ సామ్రాజ్యవాదానికి తలగకుండా కార్మిక కర్షక రక్షణ కోసం నికరంగా నిలబడిన కూడా క్యూబా ప్రభుత్వానికి ప్రజలు అన్ని విధాల సంఘీభావం తెలపాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. స్థానిక మరి చెట్ల పాలెం సెంటర్లో బుధవారం క్యూబా సంఘీభావనిధిని ప్రజల నుంచి వ్యాపారస్తుల నుంచి సేకరించారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా నిరంతర క్యూబాను తన గుప్పెట్లో పెట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎదుర్కొంటూ ఆ దేశ ప్రజలు వీరోచితంగా నిలబడుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. లాటిన్ అమెరికా దేశాల్లోనూ ఉన్న గనులను మరియు ఆయిల్ నిక్షేపాలు వనరులను కాజేసేందుకు అమెరికా కార్పొరేట్ శక్తులు దశాబ్దాలుగా చేస్తున్న కుట్రలు కుతంత్రాలకు క్యూబా ప్రజలు ఎదుర్కొంటున్న తీరు సామ్రాజ్యవాద వ్యతిరేకంగా నిలబడే ప్రతి ప్రజా తంత్ర వాది హృదయాన్ని ఉత్తేజపరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు గంగుల చెన్నకేశవులు నువ్వు శీను మోటా శీను తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లు, ప్లాట్ల కొనుగోలులో జాగ్రత్త

విశాలాంధ్ర - ఒంగోలు : అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని జాయింట్ కలెక్టర్ మరియు ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ శ్రీ.ఆర్.గోపాలకృష్ణ చెప్పారు. స్థిరాస్తి కొనుగోలుదారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధి, ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు, తదితర వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను బుధవారం ప్రకాశం భవనంలో ఎంపీ శ్రీ.మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా, కనిగిరి శాసనసభ్యులు శ్రీ. ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు శ్రీ.బి.ఎన్.విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాతలతో కలిసి ఆవిష్కరించారు.

శ్రీ వేనూతల కాటంరాజు దేవస్థానం చైర్మన్‌గా గుమ్మా గంగరాజు

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన శ్రీ వేనూతల కాటంరాజు దేవస్థానం పాలకమండలి చైర్మన్ గుమ్మా గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ అధ్యక్షతన యాదవ సంఘం సమావేశం జరిగింది. పీఎల్‌పీ మాట్లాడుతూ కాటంరాజు దేవస్థానం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని కోరారు. ఇటీవల జరిగిన కాటంరాజు తిరుణాల సందర్భంగా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అందించిన సేవలు మరువలేనివని అన్నారు. కాటంరాజు దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రహదారిని నిర్మించాల్సిన అవసరం ఉందని ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని అన్నారు. నూతన చైర్మన్‌గా ఎన్నికైన గుమ్మా గంగరాజు మాట్లాడుతూ తనపైన ఎంతో నమ్మకంతో కాటంరాజు దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా బాధ్యతలను అప్పచెప్పిన యాదవ సంఘం ప్రతినిథులందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. దేవస్థానం అభివృద్ధి కోసం అవిరాల కృషి చేస్తానని మీ అందరి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. యాదవ సంఘం ప్రతినిథులు ఒంటేరు నాగేశ్వరరావు, గుమ్మా బాల నాగయ్య, సుబ్బారావు, పిన్నిక చక్రపాణి పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అంగన్వాడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చి పాఠశాలలను బలోపేతం చేయాలని యర్రగొండపాలెం ఎంఇఓ పి ఆంజనేయులు అన్నారు. బుధవారం యర్రగొండ పాలెంలోని యంపిపియస్ అంబేద్కర్ నగర్ లోని పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్ఎంటీ లతో కలసి యంఇఓలు యర్రగొండపాలెంలోని అంగన్వాడీ పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ లలో 5 సంవత్సరాలు వయసు నిండిన వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, వచ్చే విద్యా సంవత్సరంలో మండలంలో 31 మోడల్ ప్రైమరీ స్కూల్స్ గా మారాయని వాటిలో తరగతికి ఒక టీచర్ ఉంటారు. విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వ పాఠశాలల సహకారం వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు బడికి అలవాటు పడుతారనీ, బడి అంటే భయం లేకుండా వుండే విధంగా తర్ఫీదు నిస్తున్నారనీ అంగన్ వాడీ కార్యకర్తల సేవలు కొనియాడారు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల వారు కాంపైన్‌లు నిర్వహించి, తల్లిదండ్రులకు తమ పాఠశాలల్లో చేర్చుకొనుటకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, మనం కూడా ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, ప్రభుత్వ పథకాలు, గ్రామానికి ప్రభుత్వ పాఠశాల ప్రధానోద్దేశం వివరించాలని, ఫ్లెక్సీలు, ర్యాలీలు, కళా జాతరలు నిర్వహించి విద్యార్థుల నమోదులో ముందుండాలని పిలుపు నిచ్చారు. ప్రతీ పాఠశాలవారు అంగన్ వాడీ కార్య కర్తలను సంప్రదించి 5 సంవత్సరాల వయసు పూర్తయిన వారి వివరాలు ఈనెల 10 వతేదీ లోపు యివ్వాలని తెలియచేశారు. అంబేద్కర్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నకేశవ స్వామి, తిరుపతి నాయక్, శ్రీకాంత్, సిఆర్ఎంటీ లు కోటేశ్వరరావు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర-కొమరోలు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాటు సారా నిర్మూలన కార్యక్రమం నవోదయ 2.0 లో భాగంగా బుధవారం మండలంలోని ఎర్రగుంట్ల గ్రామము, గిద్దలూరు మండలం ఓబులాపురం తండా బుర్జుపల్లి తండా, వెంకటాపురం తండా మరియు దిగువమెట్ట గ్రామాలలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జయరావు నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించారు. నాటు సారా తయారు చేయడం,అమ్మకం,రవాణా, ముడి పదార్థాలు అమ్మకం గురించి తెలిసిన సమాచారాన్ని 9440902507ఫోన్ లేదా వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియపరచి నాటు సారా తయారీ అక్రమ మద్యాన్ని అరికట్టుటకు సహకరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జయరావు, హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్, సిబ్బంది శ్రీపతి, హరిబాబు మరియు పత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక సేవ సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమ కార్యాలయం నందు బుధవారం పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే అంగన్వాడి సెంటర్ కు పిల్లల కొరకు సీలింగ్ ఫ్యాన్‌ను భాస్కరు సుధారాణి లు బహూకరించారు. మరొక సెంటర్ కు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణ స్వామి చౌదరి సెక్రెటరీ చివుకుల రామ్ గోపాల్ జాయింట్ సెక్రెటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు సభ్యులు వేమ కవిత చలువాది చంద్రావతి ఎస్ ధనలక్ష్మి భాస్కరుని సుధారాణి కొప్పోలు శ్రీనివాసరావు రంకూరి జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

గట్టిగ షేక్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుందన్నారు.తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు.యాప్‌లోని సేఫ్ ట్రావెల్ అనే సదుపాయం ఉంటుందన్నారు. మహిళలు విద్యార్థినులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఆటోలలో, క్యాబ్ లేదా ఇతర వాహనాల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భంలో సేఫ్ ట్రావెల్ సదుపాయాన్ని ఎంపిక చేసుకొని బయలుదేరే ప్రాంతం,చేరుకోవాల్సిన గమ్యస్థానం,ప్రయాణంచేసే వాహనం నెంబర్ తదితర వివరాలు అందులో నమోదు చేయాలన్నారు.వాహనం వెళ్లే మార్గం కంట్రోల్ రూమ్ నుండి పరివేక్షించబడుతుందన్నారు. వాహనం నిర్దేశిత మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్తుంటే కంట్రోల్ రూమ్‌కు మెసేజ్ వెళు తుందన్నారు.వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపడం జరుగుతుందన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళకు రక్షణ కల్పించి తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు.మహిళలు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌లకు వెళ్ళవలసిన అవసరం లేకుండా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. గివ్ ఏ కంప్లైంట్ అనే సదుపాయం ఎంచుకొని జిల్లా, పోలీస్ స్టేషన్ ఎంపిక చేసుకొని ఏ అంశంపై ఫిర్యాదు చేస్తున్నారో పేర్కొనాలన్నారు. కాగితంపై రాసిన లేదా టైప్ చేసిన ఫిర్యాదును అప్లోడ్ చేయాలన్నారు. ఆ ఫిర్యాదును పరిశీలించి పోలీసులు మిమ్మల్ని సంప్రదిస్తారని తెలిపారు. మహిళలు కొత్త ప్రదేశానికి వెళ్ళినట్లయితే యాప్ వినియోగించుకొని అక్కడ దగ్గరలో ఉన్న నైట్ షెల్టర్లు, సురక్షితమైన ప్రదేశాల గురించి సమాచారం తెలుసుకోవచ్చునన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌ల వివరాలు అక్కడి పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు, అత్యవసర నెంబర్లు ఈ యాప్‌లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. జిల్లాలోని మహిళలు విద్యార్థినిలు తమ మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

పేదలందరికీ నివేశన స్థలాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-మార్కాపురం : అనేక సంవత్సరాల నుంచి సొంత ఇళ్లు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన పేదలందరికీ నివాస స్థలాలు మంజూరు చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నివాసస్థలాలు మంజూరు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న పేదల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. నాసరయ్య మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే అర్హులైన పేదలందరికీ యుద్ధ ప్రాతిపదికపై నివాస స్థలాలతో పాటు గృహ నిర్మాణం కూడా పూర్తి చేసి ఇస్తామని ఎన్నికల్లో పదేపదే ప్రకటించిన ఎన్డీఏ కూటమి అధికారం అనంతరం ఈ విషయాన్ని పూర్తిగా మరిచిపోయిందని ఆయన విమర్శించారు. నివాస స్థలాల కోసం సీపీఐ అనేక సంవత్సరాలుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ పాలకవర్గాలు స్పందించకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కె కాశిం మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

తాము అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో కన్న మరింత ఉధృతంగా ధరలు పెట్రేగిపోతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కె కాశిం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల, పొదిలి సీపీఐ కార్యదర్శులు కేవీ రత్నం, వీరయ్య, పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న పార్టీ నాయకులు దుప్పట్ల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పై సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీపీఐ ప్రతినిధి బృందం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు అందజేశారు.

'పేస్'లో పూర్వ విద్యార్థి ప్రత్యేక ఉపన్యాసం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం "సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్"పై గెస్ట్ లెక్చర్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం ఏఐడీఎస్ మరియు ఏఐఎంఎల్ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం పరిశ్రమలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీమతి సుష్మా పోతురాజు రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఆమె సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రాధాన్యత, రకాలు (మాన్యువల్ అండ్ ఆటోమేషన్ టెస్టింగ్), బగ్ ట్రాకింగ్ టూల్స్ వినియోగం, అలాగే ప్రాజెక్ట్ నిర్వహణలో అవసరమయ్యే ముఖ్యమైన నైపుణ్యాలపై వివరించారు.అలాగే, ప్రాజెక్ట్ నిర్వహణలో జట్టు పనితీరు, కాల నియంత్రణ, స్క్రమ్ మరియు అజైల్ విధానాల వినియోగంపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగించారు. సెక్రటరీ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ, ఈ తరహా గెస్ట్ లెక్చర్లు విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహనను కలిగించి వారి భవిష్యత్తు కెరీర్‌కు మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.కె.మూర్తి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ మద్దిశెట్టి కళ్యాణ్, ఏఐడీఎస్ విభాగాధిపతి డాక్టర్ కె. సుధీర్ చక్రవర్తి, ఏఐఎంఎల్ విభాగాధిపతి శ్రీమతి ఎస్.కె. హినా కౌసర్, కో-కన్వీనర్ బి.ఎస్.ఎన్. శ్రావణి, కోఆర్డినేటర్లు జె. పవిత్ర, జి.శ్రీదేవి పాల్గొన్నారు.

పవన్ కుమారుడి ఆరోగ్యం మెరుగవ్వాలి

జనసేన నాయకుల పూజలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని మంగమ్మ కాలేజీ వద్ద గల ఆంజనేయస్వామి గుడిలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలుకోవాలని, ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని ఒంగోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో 101 టెంకాయలతో పూజ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రవిశంకర్ గ్రూప్ అధినేత, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, కృష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, దండే అనిల్, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమలి, మనోజ్ రాయల్, ఆకుపాటి ఉష, మాల్యాద్రి నాయుడు, ఒంగోలు నగర సంయుక్త కార్యదర్శి సుంకర కళ్యాణి, తన్నీరు ఉష,3వ డివిజన్ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, 2వ డివిజన్ అధ్యక్షులు బ్రహ్మనాయుడు,38వ డివిజన్ అధ్యక్షులు ఆలా నారాయణ, 9వ డివిజన్ అధ్యక్షులు నరసింహారావు,15వ డివిజన్ ఉపాధ్యక్షులు ఉంగరాల సాయి, 16వ డివిజన్ అధ్యక్షులు అల్లూరి శ్రీహరి, ఉపాధ్యక్షులు కర్రీ శ్రీకాంత్, 21వ డివిజన్ అధ్యక్షురాలు వాసుకి నాయుడు, 37వ డివిజన్ అధ్యక్షులు నరహరి సాంబయ్య, జనసేన నాయకులు కాసాని వాసు, తిరుమలశెట్టి వెంకట్రావు, బాయిరెడ్డి వేణు, వెంకటేష్, జగతపి మహేష్, శ్రీ సాయి, అంజిని నాయుడు, బందారు గిరి, వెంకటేశ్వర్లు నీడికొండ, అవినాష్ నాయుడు, పోలిరెడ్డి, కాకుమాను శివ రావు,ఆనంద్ నాయుడు కత్తుల, వీర మహిళలు నక్క ప్రమీల, ఏడుంబాకుల అనూష, నాగేంద్రం, తెలుగు మహిళలు దుర్గ మల్లేశ్వరి, కొక్కిలిగడ్డ లక్ష్మి పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై పోలీసుల అవగాహన

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శక్తి టీం ముండ్లమూరు కేజీబీవీ(గర్ల్స్) విద్యార్థినిలకు శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి తెలియచేస్తున్నారు. శక్తి టీం విద్యార్థినిలకు యాప్ గురించి తెలియజేసి, యాప్ డౌన్‌లోడ్ మరియు వినియోగం ఏ విధంగా చేయాలో వివరించారు. శక్తి యాప్ మహిళల భద్రత కొరకు రూపొందించబడిందని, అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆపద ఆ సమయంలో ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసి ఎలా రక్షణ పొందవచ్చునో అవగాహన కల్పించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్ లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్ ఎంచుకొని దానిలో ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతున్నారను వివరాలు నమోదు చేస్తే వెళుతున్న మార్గాన్ని కంట్రోల్ రూమ్ నుండి ట్రాక్ చెయ్యబడుతుందన్నారు. వెళ్లవలిసిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో వాహనం వెళుతుంటే వెంటనే దగ్గరలోని పోలీసులకు సందేశం వెళుతుందని క్షణాల్లో పోలీసులు బాధితురాలు ఉన్న ప్రదేశానికి చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. ఆపద సమయంలో ఆడ/మగ , చిన్న/పెద్ద అనే వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగకరమని ప్రజలకు చెప్పారు. మహిళల భద్రత మరియు రక్షణ కోసం శక్తి యాప్ ను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్ నందు డౌన్లోడ్ చేసుకోవాలని వారికి అవగాహన కల్పించి, యాప్ డౌన్ లోడ్ చేస్తున్నారు. ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది.

ఘనంగా 'బీకే విద్యా మందిర్' వార్షికోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఆర్ ఎం ఎస్ కళ్యాణ మండపం నందు బికె విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 9వ వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రత్నం విద్యాసంస్థల అధినేత సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సి ఎస్ పురం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రుద్రపోగు సుమన్ గారు హాజరై విద్యార్థులను ఉద్దేశించి క్రమశిక్షణతో కలిగిన విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. అదే విధంగా మరో విశిష్ట అతిథి అయిన బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు బలహీనతలకు లొంగకుండా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సి ఎస్ పురం గ్రామ సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి ఉప సర్పంచి పాములపాటి నరసయ్య మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బత్తుల వెంకటాద్రి బి కే విద్యా మందిర్ హెడ్మాస్టర్ డి సూర్య రత్నం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సి ఎస్ పురం ఎన్ వెంకటేశ్ బెల్లంకొండ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కే నారాయణ. ఎస్.కె షరీఫ్ ఆదిత్య జూనియర్ కాలేజ్ పామూరు ప్రిన్సిపల్ ఆర్ నాగరాజు వీరిశెట్టి జూనియర్ కాలేజ్ పొదిలి డైరెక్టర్ వి.కృష్ణంరాజు ప్రిన్సిపల్ ఎస్ నరసింహారావు విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంకాలమ్మ పోలేరమ్మ గ్రామదేవతల గ్రామోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలం వారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి అంకాలమ్మ పోలేరమ్మ గ్రామదేవతల గ్రామోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు పాల్గొని పూజలు చేశారు.

11న టీఎన్‌టీయూసీ రాష్ట్ర సమావేశం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఈ నెల 11 వ తారీకున శుక్రవారం ఉదయం టిడిపి కేంద్ర కార్యాలయం మంగళగిరి నందు రాష్ట్ర సమావేశం నిర్వహించబడుతుందని ఒంగోలు పార్లమెంటు టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కనుక ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్యేపల్లా శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టిఎన్‌టియుసి ఇన్చార్జి దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శిపరుచూరి అశోక్ బాబు మాజీ ఎమ్మెల్సీ హాజరవుతున్నారు. టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు, భవన నిర్మాణం అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్..గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుంది. కనుక ఈ సమావేశంకు ఒంగోలు పార్లమెంట్ పరిధిలో ఉన్న టిఎన్టియుసి రాష్ట్ర జిల్లా కమిటీ సభ్యులు అన్ని అసెంబ్లీ కమిటీల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావలసిందిగా ఈదర మల్లయ్య కోరారు.

ట్రాక్టర్ బోల్తా

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం ఎడమకళ్ళు గ్రామం సమీపంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాంట్రాక్ట్ కరెంట్ పనుల కోసం కూలీలను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా గిద్దలూరు ఆసుపత్రికి తరలించారు.

వృత్తి విద్యలో నైపుణ్యం అవసరం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల దోర్నాలలోని వొకేషనల్ విద్యార్థులు ఆటోమోటివ్ మరియు ఐటి ట్రేడ్లలో భాగంగా ఈ నెల(ఏప్రిల్) 3వ తేదీ నుండి 13 వతేదీ వరకు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో పాల్గొంటున్నారు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం దోర్నాలలోని ఆటోమొబైల్ షోరూమ్స్, మీ సేవ సెంటర్లో నిర్వహించుచున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వాహనాల సేల్స్, సర్వీసెస్ పని తీరుపై ప్రత్యక్ష అవగాహన, డేటా ఎంట్రీ, ఫొటో షాప్ వంటి వాటిలో నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ అందించడం జరుగుతుంది. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో 10వ.తరగతి విద్యార్థులు పాల్గొని అవగాహన పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ దేవి, ఐటీ ఒకేషనల్ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్, ప్రేమ్చంద్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో శాంతి భద్రతల పరిరక్ష నేలక్ష్యంగా ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని నూతన ఎస్సై కే కమలాకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఎస్ఐగా కమలాకర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ వై నాగరాజు బదిలీపై బాపట్ల జిల్లా బల్లికురవకు వెళ్లారు. ఆయన స్థానంలో ఒంగోలు విఆర్ లోవిధులు నిర్వహిస్తూ ఉన్న ఎస్సై కమలాకర్ బదిలీపై ముళ్ళమూరు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాల లో కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అనంతరం సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, అంకారావు, మరియబాబు, ప్రేమనిది, పున్నారావు, సూరిబాబు, లక్ష్మి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారు చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రతి గ్రామపంచాయతీలో చెత్త సంపాద కేంద్రాల ద్వారా చెత్త నుండి సంపద తయారు చేయాలని ఒంగోలు డివిజనల్ అధికారిని ఆర్ పద్మావతి అన్నారు. మండలంలోని కెల్లంపల్లి, పుల్లగల్లు, వేముల,ఈదర పంచాయతీ గ్రామాలలో ఐవిఆర్ఎస్ లో భాగంగా ప్రతి ఇంటింటికి తిరిగి గర్బేజ్ కలెక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లు చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి వేరు చేయాలన్నారు. చెత్త సంపద నుండి వచ్చిన ఎరువును విక్రయించి వాటి ద్వారా వచ్చిన నగదును గ్రామపంచాయతీల అభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంటా యోగేశ్వరి వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, గురునాథం, రాజరాజేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీసేవ అర్జీలపై అవగాహన

విశాలాంధ్ర - బేస్తవారిపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మీసేవ అర్జీలపై డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ ఆపరేటర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ జితేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం, మీసేవల్లో దాఖలు పరిచే అర్జీల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ సలీం, డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలోనే పోషక విలువలు

విశాలాంధ్ర-పిసిపల్లి : చిరుధాన్యాలలోనే పోషక విలువలు కలిగి ఉంటాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ జరీనా అన్నారు కనిగిరి ఐసీడీఎస్ పరిధిలోని పిసిపల్లి మండలం పెద అలవలపాడు సెక్టారు పరిధిలోని పెదఅలవలపాడు మెయిన్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిరుధాన్యాల గురించి వాటినుండి అందే పోషణ గురించి గర్భిణీ మహిళలకు యుక్త వయస్సు మహిళలకు బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ వైజర్ మాట్లాడుతూ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడి పరిధిలో గల మహిళలకు చిరుధాన్యాల వల్ల అందే పోషక విలువలను తెలియజేయడం జరిగిందని అన్నారు. మహిళలు రాగులు సజ్జలు కొర్రలు, మొదలగు త్రుణ ధాన్యాలు తీసుకోవడం ద్వారా వాటి నుండి ఐరన్ పిండిపదార్థాలు అధికంగా లభిస్తాయని తెలిపారు. చిరుధాన్యాలను తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శిరీష చిన్నక్క శ్రీలక్ష్మి శ్రావణి ఆయాలు మాధవి కొండమ్మ బాలింతలు, గర్భిణీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర-వెలిగండ్ల : సచివాల సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా హెచ్చరించారు బుధవారం మండలంలోని రామ గోపాలపురం, ఇమ్మడి చెరువు, పి రాళ్లపల్లి, నాగులవరం తదితర సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. అనంతరం సచివాలయ రికార్డులు పరిశీలించారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా సిబ్బంది పాల్గొన్నారు.

గృహసాధికారిక సారథులు నియామకం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కంబాలదిన్నె పంచాయతీ పరిధిలోని రజాసాహెబ్ పేట, రేణమడుగు గ్రామాలలో గల ఐదుభూతులకు కుటుంబ సాధికారిక సారథులుగా నియమితులైన జాబితాను బుధవారం మండల టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లుకు మన్నం రమణయ్య అందజేశారు. అలాగే పామూరు పట్టణంలో 269 బూత్ పరిధిలో కుటుంబ సాధికారిక సారథులు ను పూర్తి స్థాయిలో నియమితులైన జాబితాను టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లుకు ఇంఛార్జీ పత్తు మస్తాన్ అందచేశారు. కార్యక్రమంలో మోపాడు ప్రాజెక్ట్ సూపర్ చైర్మన్ చంచు కొండయ్య, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్రావు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి యస్.డి.అమీర్ బాబు, మెంటా నరసింహారావు, కంచర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి : ఎంపీడీవో

విశాలాంధ్ర-పామూరు : అంగన్వాడి కేంద్రాలలో బాలింతలకు గర్భిణీలకు చిన్నారులకు అందించే పౌష్టిక ఆహారమును తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని బుక్కాపురం, మోట్రావులపాడు, పామూరు 1,2 సచివాలయాల పరిధిలోని అంగనవాడి కేంద్రాలలో పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.వి.ఎస్ పార్వతి, గోళ్ళ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. బుక్కాపురం అంగన్వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, స్వయంకృషి నాయబ్ రసూల్, డి.శంకర్, షేక్ సుభాని పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : తమకు అమ్మిన భూమిని మా ప్రమేయం లేకుండా వేరే వారికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణకు బాధిత రైతులు జూపల్లి వీరబాబు, జూపల్లి వెంకటేష్ బుధవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని బృందావనం వద్దగల సర్వేనెంబర్ 78/10లో 10 సెంట్ల భూమిని 1992 సంవత్సరంలో జమ్మలమూడి ఎలమంద వారి కుటుంబ సభ్యులు దర్శికి చెందిన దామెర్ల చలపతిరావు కుమారుడు దామెర్ల రాజారావులకు విక్రయించి అగ్రిమెంటు రాయడం జరిగింది. అదే భూమిని దామెర్ల రాజారావు 1995లో జూపల్లి బాలకృష్ణమూర్తి కుమారుడు జూపల్లి వీరబాబు కు విక్రయించి అగ్రిమెంటు రాశారు. అప్పటినుండి జూపల్లి వీరబాబు భూమిని సాగు చేసుకుంటూ ఫల సాయం పొందుతున్నాడు. తమకు రిజిస్ట్రేషన్ చేయాలని జమ్మల మూడిఎలమందను పలుమార్లు కోరినప్పటికీ కాలయాపన చేస్తూ తమకు రిజిస్ట్రేషన్ చేయలేదు. దీంతో ఆ భూమికి సంబంధించి 2023 మార్చి నెలలో కోర్టును ఆశ్రయించడం జరిగింది. ఇటీవల ఎలమంద చనిపోవడంతో ఆ భూమిని ఎలమంద భార్య మరియమ్మ ఆమె కుమారులు కోటయ్య, చిన్నకోటయ్యలు కలిసి 2023 నవంబర్లో ఒంగోలు పట్టణం హ్యాపీ హోమ్స్ గురవారెడ్డి నగరకు చెందిన మారం వెంకటరెడ్డి కుమారుడు మారం వెంకటేశ్వర్ రెడ్డికి 1 లక్ష, 5 వేల రూపాయలకు దర్శి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. మాకు విక్రయించి అగ్రిమెంట్ రాసి ఉన్న ఆ భూమిని మా అనుమతి లేకుండా వెంకటేశ్వర రెడ్డికి రిజిస్ట్రేషన్ చేసిన జమ్మలమూడి మరియమ్మవారి కుమారులు కోటయ్య, చిన్న కోటయ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పాసు పుస్తకాన్ని రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ను రద్దు చేయాలని బాధితులైన జూపల్లి వీరబాబు, జూపల్లి వెంకటేష్, జూపల్లి కోటేశ్వరరావు కోరారు.

చలివేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర - అద్దంకి : వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు, పలు ప్రాంతాల నుంచి అద్దంకి వచ్చే ప్రజానీకానికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ నిధులతో పట్టణంలో తొమ్మిది చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర బుధవారం తెలిపారు.కమిషనర్ మాట్లాడుతూ చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వస్తే మున్సిపల్ ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేస్తామన్నారు.వార్డుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలి: ఎంఈవో

విశాలాంధ్ర - అద్దంకి : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ సుధాకర్ అన్నారు.ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యా కమిటీ చైర్మన్లు ఆయా పాఠశాలల పరిధిలోని గృహాలను సందర్శించి ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ఈనెల 15లోపు పాఠశాలల్లో చేర్పించాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత భోజనం,పుస్తకాలు యూనిఫామ్ అందిస్తున్నట్లు తెలిపారు.తల్లికి వందనం ద్వారా విద్యార్థికి సంవత్సరానికి 15వేలు లబ్ది చేకూరుతుందన్నారు.

కళ్యాణ మండపానికి అరుళానంద స్వామి వితరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి దేవాలయాన్ని అరుళానంద స్వామి,మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌లు సందర్శించారు.అక్కడ నిర్మాణంలో ఉన్న కళ్యాణ మండపంను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణానికి రూ.1,50,000 ఆర్థిక సహాయాన్ని ఆమంచి చేతుల మీదుగా స్వామీజీ ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.అనంతరం పేద విద్యార్థినులైన చుందూరి శ్రావణి,గోలి గాయత్రిలకు చదువు నిమిత్తం ఆర్థిక సహాయంగా చెక్కులను పంపిణీ చేశారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 11,12,13 తేదీల్లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి అన్నదాన నిమిత్తం రూ.30,000 అందించారు.ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వామీజీ సహాయం చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. చీరాల జడ్పీటీసీ ఆకురాతి పద్మిని,మాజీ సర్పంచ్ గంజి వెంకటేశ్వర్లు,దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలపై సీపీఎం ఆధ్వర్యంలో రేపల్లె నెహ్రూ బొమ్మవద్ద బుధవారం నిరసన తెలియజేశారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధర కొంతమేర తగ్గించి ఇప్పుడు మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు ఆహారం వండటానికి ఉపయోగించుకునే ప్రధానమైన గ్యాస్ సిలిండర్ ధర రూ.50 రూపాయలు పెంచటం అంటే ప్రజలని మోసం చేయడం అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నేతలు కేవీ.లక్ష్మణరావు,కె.ఆశీర్వాదం, వై.కిషోర్,కె.గోపి, కే.రమేష్,కే. నాంచారమ్మ, డి.అగస్టిన్, జి.దానియేలు,డి.బాబురావు,వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలి

సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ధరలను తగ్గిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో లెక్కలేని అన్నిసార్లు గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజలపై భారాలను మోపుతుందని ఆయన విమర్శించారు.ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలను పదే పదే పెంచుతుందని శ్రీనివాసరావు ఆరోపించారు.వంటగ్యాస్ సిలిండర్‌కు రూ.50,పెట్రోలు,డీజిలకు లీటరుకు రెండు రూపాయలు చొప్పున పెంచి ప్రజలపై కోట్లాది రూపాయల పెను భారాన్ని మోపిందని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించా లని ఆయన డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు డి.శ్రీనివాసరావు,ఓబులశెట్టి రమేష్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియో విడుదల

- బాధిత కుటుంబానికి 15 లక్షలు మంజూరు
- క్షతగాత్రులకు రెండున్నర లక్షలు విడుదల
- సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : పసుమర్రు చిలకలూరిపేట మధ్య గత ఏడాది మే నెలలో జరిగిన రోడ్డు (బస్సు)ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో విడుదల చేసింది.బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకొని అండగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖలు అందజేశారు.ఇటీవల చిన్నగంజాం పర్యటనలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.దీనికి తక్షణమే స్పందించిన సీఎం చంద్రబాబు బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.బాధిత కుటుంబాల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరికి సీఎంఓ నుంచి వెల్లడించారు. గత ఏడాది మే నెలలో బస్సు ప్రమాదంలో చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు,లక్ష్మి,ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ మృతి చెందారు.మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.2.50 లక్షలు చొప్పున విడుదల చేశారు.వారిలో ముప్పరాజు దుర్గా పూజ,ముప్పరాజు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి భావన,దావులూరి అంజమ్మలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున, క్షతగాత్రులు బాడుగు సంజన,గడిపాటి తేజస్విని, దొప్పలపూడి భావనలకు ఒక్కరికి రెండున్నర లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచినందుకు సీఎం ఆ కుటుంబాల తరపున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుండి టైలర్స్ శిక్షణ ప్రారంభం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : స్వయం ఉపాధిలో భాగంగా టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం నుండి చెరుకుపల్లి రెండవ సచివాలయంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని తెలిపారు.

బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలం మొత్తం మీద 344 మంది టైలర్ శిక్షణ కొరకు నమోదు చేసుకోగా మొదటి బ్యాచ్ 117 మంది,రెండవ బ్యాచ్‌కి 114 మంది,మూడవ బ్యాచ్‌కి 113 మంది చొప్పున మొత్తం 344 మందికి శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. మొదటి బ్యాచ్ 117 మంది టైలర్స్ బెనిఫిర్స్‌ను రెండు బ్యాచ్లుగా చేసి ఒక్కో బ్యాచ్‌కి 60 మంది చొప్పున గురువారం నుండి మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటల నుండి 1గంట వరకు,రెండో బ్యాచ్ 1గంట నుండి 5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగునని తెలియజేశారు.మొదటి బ్యాచ్‌లో కుంచలవారిపాలెం, రాంబట్లపాలెం, కావూరు,ఆరుంబాక,చెరుకుపల్లి-1,చెరుకుపల్లి-2, గుల్లపల్లి,బలుసులపాలెం,తుమ్మలపాలెం గ్రామాలకు చెందిన వారు ఉంటారని అలాగే రెండో బ్యాచ్లో గూడవల్లి,నడింపల్లి,కనగాల,ఆరేపల్లి, అల్లవారిపాలెం, తూర్పుపాలెం, పొన్నపల్లి,రాజోలు గ్రామాల లబ్ధిదారులు పాల్గొంటారన్నారు.మూడు నెలల పాటు జరిగే ఈ శిక్షణలో 90శాతం హాజరు కలిగి ఉండి పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేయబడతాయని ఆయన తెలియజేశారు.

సాధారణ కాన్పుపై అవగాహన

విశాలాంధ్ర - పర్చూరు : సాధారణ కాన్పుతో తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం జరిగింది. గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ సాధారణ కాన్పు వలన తల్లికి క్షేమం,బిడ్డకు రక్ష అని,తల్లి బిడ్డల సంక్షేమం మన ప్రథమ ధ్యేయం అన్నారు.ప్రతి ఒక్కరూ సాధారణ కాన్పును ప్రోత్సహించాలని, గర్భం దాల్చక ముందే సాధారణ కాన్పుపై అవగాహన కొరకు దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో కౌన్సిలింగ్ తీసుకోవడం మంచిదన్నారు.సాధారణ కాన్పు వలన తల్లి శిశు మరణాల రేటు తగ్గుతుందన్నారు. తల్లి వెంటనే కోలుకుంటుందని తద్వారా వెంటనే బిడ్డకు ముర్రు పాలు ఇస్తుందని,తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఏర్పడుతుందన్నారు.తల్లి మానసికంగా ఆత్మస్థైర్యం కలిగి ఉంటే పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయన్నారు.పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని,ముర్రుపాలు ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుందన్నారు.ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డకు శ్వాసకోశ సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, బిడ్డకు మంచి తెలివి తేటలు వస్తాయన్నారు. ముర్రుపాలు ఇవ్వలేక పోవడం,తల్లి బిడ్డ మధ్య అనుబంధం ఉండదని,తల్లి మానసికంగా సిద్ధపడకపోడం వలన పాలు సరిగా ఉత్పత్తి అవ్వకపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.తల్లి బిడ్డల సంక్షేమం కోసం సాధారణ కాన్పుని ప్రోత్సహించాలని సూచించారు.కార్యక్రమంలో జనరల్ డాక్టర్ సౌమ్య, జనరల్ సర్జన్ డాక్టర్ ఆలీ,హెడ్ నర్స్ రత్న కుమారి,నర్సులు,ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు, గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

11న ఏపీ నాన్ గెజిటెడ్,గెజిటెడ్ ఆఫీసర్స్ జనరల్ బాడీ సమావేశం

విశాలాంధ్ర - రేపల్లె : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్,గెజిటెడ్ ఆఫీసర్స్ రేపల్లె యూనిట్ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు రేపల్లె మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు ఏపి ఎన్జీజిఓ రేపల్లె యూనిట్ అధ్యక్షులు కె.అంకమ్మరావు బుధవారం విలేకరులకు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జి.శ్రీనివాసరావు,ఎ.శ్యాం సుందర్ శ్రీనివాస్‌లు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని ఆయన చెప్పారు.కావున కార్యవర్గ సభ్యులు,సభ్యులు సకాలంలో హాజరు కావల్సిందిగా అంకమ్మరావు కోరారు.

దేవదాయ భూములను అధికారులు పరిశీలన

విశాలాంధ్ర-పామూరు: మండల కేంద్రమైన పామూరు లోని నెల్లూరు రోడ్డులో ఉన్నటువంటి శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవాలయం కి చెందిన భూములను బుధవారం అధికారులు పరిశీలించారు. దేవదాసి భూములు 365/2 లోని 2.19 సెంట్లు, 365/3 లోని 2.10 ఎకరాలలో నిర్మించిన శ్రీనగర్ కాలనీ, 322/11 లోని 0.55 సెంట్లు లోని పెట్రోల్ బంకు, షాపింగ్ కాంప్లెక్స్ ని దేవదాయ శాఖ జిల్లా అధికారి యం పానకాలరావు, ఇనిస్పెక్టర్ సత్యనారాయణ, ఈవో నరసింహారావు పరిశీలించారు. ఈ భూములు పరిశీలించి నివేదికను ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ యం పానకాలరావు తెలిపారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సింగపూర్‌లోని స్కూల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ అస్వస్థతకు గురవటంతో బాపట్ల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ పిట్లలవానిపాలెం మండలం చందోలులోని భగలాముఖి అమ్మవారి దేవస్థానంలో మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు హుస్సేన్ బేగ్ బాపట్ల రూరల్ మండలం అధ్యక్షులు దాసరి ఏసుబాబు, దమ్మన్నవారిపాలెం సర్పంచ్ జగ్గయ్య,యాజలి గ్రామ పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు,సత్యనారాయణ మాస్టారు,ఉస మాధవి,ఇక్కుర్తి చక్రపాణి, మెండు కిషోర్,ఇమడాబత్తిన సుధాకర్,సయ్యద్ అన్వర్,సయ్యద్ సద్దాం హుస్సేన్,షైక్ జహీరబాషా, షైక్ అలీ,షైక్ షరీఫా,కట్టుపల్లి మధుబాబు,హుస్సేన్ బేగ్,షైక్ రఫీ,చల్లపల్లి ఏసోబు,గజ్జ వెంకటేష్,గండూరి మోహన్ పాల్గొన్నారు.

చర్చలేవ్.. అజెండా అంశాలన్నీ ఆమోదం...

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశ మందిరంలో జరిగింది.ఈ సమావేశంలో ఎజెండాలో పొందుపరచిన 41 అంశాలు ఎటువంటి చర్చ లేకుండానే ఆల్ పాస్ సంస్కృతిలో ఆమోదం పొందాయి.ఈ సమావేశానికి కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,ఇంఛార్జి కమిషనర్ టి.రఘురామ్,అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- భారత మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా కమిషనర్ మునిసిపల్ కార్యాలయానికి తాళాలు వేయడం,దానిపై చైర్మన్ కొంతమంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడమే కాక ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడం తదితర చర్యల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి చీరాలలో పోలీసులు అసాధారణ భద్రత కల్పించారు.కౌన్సిల్ సమావేశంలో పాల్గొనే వారిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలికి పంపారు.బయటి వ్యక్తులను అనుమతించ లేదు.ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తున్నామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు బాపట్ల నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. బాధితుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.రానున్న రోజుల్లో బాపట్ల నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

జగన్ భద్రతపై కూటమి ప్రభుత్వ విఫలం

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌బాబు

విశాలాంధ్ర - వేమూరు : మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలని తాత్సారం చేస్తూ వ్యవహరించిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి పర్యటన ఉందని తెలిసి కూడ పోలీసులు నిమ్మక్కు నీరు ఎత్తినట్లు వ్యవహరించారని విమర్శించారు.ప్రజాదరణ ఉన్న జగన్మోహన్ రెడ్డి పర్యటనకు తీసుకోవాల్సిన కనీస భద్రత చర్యలు కూడా తీసుకోకుండా పోలీసులు వ్యవహరించారనే దానికి హెలిప్యాడ్ వద్ద ప్రజలు చేరిన విధానమే నిదర్శనం అన్నారు.ప్రజల ఆదరణ పొందుతున్న జగన్మోహన్ రెడ్డి పర్యటన చూసి ఓర్చుకోలేక రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను వెనక్కి తగ్గే విధంగా చేసిందని అశోక్‌బాబు ఆరోపించారు.కనీస భద్రత వలయం కూడా లేకుండానే జగన్మోహన్ రెడ్డి పర్యటన జరిగిందని ఆయన పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్ని అవంతరాలు సృష్టించిన ప్రజలకు జగన్మోహన్ రెడ్డి పట్ల ఉన్న ఆదరణ తగ్గించలేరని అశోక్‌బాబు తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక తప్పించుకునే ధోరణి లో వ్యవహరిస్తుందని,ప్రభుత్వ హామీలను వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఎక్కడ లేవనెత్తుతారో అని భయపడుతుందన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ట పెరుగుతుందే తప్ప తగ్గదని రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు కోటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని అశోక్‌బాబు హెచ్చరించారు.

సాగులో సాంకేతికత వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : అరుంబాక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో డాక్టర్ ఎన్.టి.ఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల,ప్రొటెక్ట్ సంస్థ వారు అఖిల భారత వ్యవసాయ పరిశోధన గిరిజన ఉప ప్రణాళిక వారి సౌజన్యంతో హైడ్రోపోనిక్స్ సాంకేతిక సాగు,నర్సరీ మానేజ్మెంట్ పై క్షేత్రప్రదర్శన,శిక్షణ కార్యక్రమము జరిగినది.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ బాపట్ల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ మాట్లాడుతూ రైతులు,ప్రజలు ఈ కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని కోరారు.ఇక్కడ ప్రదర్శించిన ఎరో టవర్లు,ఎన్.ఎఫ్.టి ట్రక్కర్ల వాటి ప్రావీణ్యత గురించి రైతులకు వివరించారు.యూనివర్సిటీ నుంచి ఎటువంటి సహాయాన్ని అయినా రైతులకు చేస్తాము అని తెలియజేశారు.డీఎఫ్ భీమయ్య ఈ ప్రోగ్రాం గురించి వివరిస్తూ ఎలా,ఏ క్రమ దశ నుంచి ఏ క్రమ వరకు టెక్నాలజీ అనేది మొక్కల్లో ఎలా పెరిగిందో చెప్పి,అలాగే ఈ హైడ్రోపోనిక్స్ ఈ కొత్త రకమైన టెక్నాలజీని ప్రజలందరూ వినియోగించుకుని ఇంకా ఈ నూతనమైన టెక్నాలజీని చిరు వ్యాపారాలు పెట్టుకొని సమాజంలో మార్పు తీసుకురావాలని,మన రైతుల యొక్క ఆలోచన ధోరణి మారాలని వివరించారు. డాక్టర్ కె.కృపావతి,హైడ్రోపోనిక్స్ అంటే ఏమిటి,దాని వలన లాభాలు,గిరిజన రైతులు ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. రైతులకు తక్కువ ఖర్చుతో సులభంగా ఏర్పరచగలిగే హైడ్రోపోనిక్ యూనిట్లను ప్రాక్టికల్ డెమోలో చూపి యించారు.కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఎస్టీ రైతులకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి స్థిరమైన ఆదాయం పొందగల దారులు చూపబడతాయి అని తెలిపారు. చంద్ర రెడ్డి నర్సరీ మేనేజిమెంట్ పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి,డాక్టర్ హేమ కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వారి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తెలుగుదేశం కార్యకర్తలు వారికి పూలమాల శాలువాలు వేసి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్ లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా మాదాల నియామకం

విశాలాంధ్ర - కనిగిరి: వైయస్ఆర్ సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ గా మాదాల వెంకట సుబ్బారావును నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మాదాల వెంకట సుబ్బారావు ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి, కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం కనిగిరి వైసీపీ కార్యాలయం లో ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల బోకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా ఎన్నికైన మాదాల వెంకట సుబ్బారావును వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. విష్ణు, కొమ్మి కాటంరాజు, రాగి బ్రహ్మయ్య, సవరం రాజేష్, శ్యామల సాంబిరెడ్డి, రమణారెడ్డి, ఇండ్ల నంద కిషోర్, ఇండ్ల విష్ణు వర్ధన్, ఇండ్ల రామకృష్ణ, రాగి మహాలక్ష్మయ్య, బాపట్ల రామకృష్ణ, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : స్థానిక సేవ సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమ కార్యాలయం నందు బుధవారం పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే అంగన్వాడి సెంటర్ కు పిల్లల కొరకు సీలింగ్ ఫ్యాన్‌ను భాస్కరు సుధారాణి లు బహూకరించారు. మరొక సెంటర్ కు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణ స్వామి చౌదరి సెక్రటరీ రామ్‌గోపాల్‌లు పాల్గొన్నారు.

ADDANKI MUNICIPALITY

E-Procurement Short Tender Notice

S. No.	Tender Notice No	Name of the Work	Estimate Amount (Rs.in Lakhs)
1	01/NIT/2025-26 to 02/NIT/2025-26	Addanki Municipality Providing of Chativendrams & Recharging of Infitration Wells	10.00

Download Start Date & Time	:	07/04/2025 6.00 PM
Download End Date & Time	:	14/04/2025 6.00 PM
Receipts of Bids end Date & Time	:	15/04/2025 4.00 PM
PQ Stage Opening Date & Time	:	15/04/2025 4.01 PM

E-Procurement Tender Notice

S. No.	Tender Notice No	Name of the Work	Estimate Amount (Rs.in Lakhs)
1	03/NIT/2025-26 to 06/NIT/2025-26	Construction of CC Drains and, Culvert and Leveling with Gravel Works	19.70

Download Start Date & Time	:	07/04/2025 6.00 PM
Download End Date & Time	:	21/04/2025 6.00 PM
Receipts of Bids end Date & Time	:	22/04/2025 4.00 PM
PQ Stage Opening Date & Time	:	22/04/2025 4.01 PM

For further details visit "www.eprocurement.gov.in"
Contact Phone No: 7331143660

Commissioner,
Addanki Municipality

మహిళా శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇచ్చి పలు కార్యక్రమాలు చేపడుతున్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. బుధవారం స్థానిక సాయిరామ్ గార్డెన్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా స్థాయి పోషన్ పక్వాడ కార్యాక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.గర్భిణీ స్త్రీలు ప్రసవాలు అయిన నాటి నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి,ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు.మహిళలు గర్భం దాల్చిన తర్వాత వారి ఆరోగ్య పరిస్థితులు బీపీ షుగర్లు,రక్తహీనతకు సంబంధించిన వ్యాధులను గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలని ఆయన అధికారులకు చెప్పారు.శిశువు పుట్టిన మొదటి 360 రోజులు వారి శారీరక దృఢత్వం కోసం అవసరమైన పౌష్టికాహారం అందించాలని ఆయన చెప్పారు.అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆరోగ్యకరమైన, బలవంతమైన ఆహారాన్ని అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు.అనాధ శిశువుల కోసం రైల్వే స్టేషన్లో బస్టాండ్‌లో ఊయలలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు.జిల్లాలో సఖి వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు.మహిళాశిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.మహిళ సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న పిల్లలను తమ సొంత పిల్లలు వలే ప్రేమానురాగాలతో చూడాలని ఆయన చెప్పారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీమంత చేసుకున్న 20మంది మహిళలకు వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.5వేల రూపాయల వంతున రూ.లక్ష నిధులను ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా 20 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా,జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖఎస్.ఇ అనంతరాజు,బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా,మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్క్ శంకర్ కోలుకోవాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనయుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు ఆంజనేయస్వామి ఆలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి పార్టీ నాయకులుతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సువచ్చల సమేత ప్రపత్యాంజ నేయస్వామి ఆలయం వద్ద జనసేన నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ,నియోజకవర్గ జనసైనికులు కారుమూరి అంజనేష్,పసుపులేటి మహేష్,కామిశెట్టి సాయిబాబు, కోకి రాజశేఖర్ రెడ్డి, పడమటి ధర్మారావు,చిలకల సురేంద్ర,విష్ణుమొలకల చంద్రమోహన్,పడమటి ధర్మారావు,దండుప్రోలు కిషోర్,బుర్రీ కిషోర్‌లు పాల్గొన్నారు.

పోషణ పక్వాడపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరులో బుధవారం అంగనవాడి సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రమాదేవి మాట్లాడుతూ పోషణ పక్వాడా కార్యక్రమం అనేది పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల పోషకాహార లోపాలను తగ్గించడానికి వారి ఆరోగ్యాలను మెరుగుపరచడానికి ప్రతి సంవత్సరం నిర్వహించే కార్యక్రమం పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజులు పై దృష్టి సారిస్తారు, ఇది పిల్లల అభివృద్ధికి కీలకమైన కాలం అని అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమం 15 రోజులపాటు ఏప్రిల్ 8 నుండి 22 వరకు జరుగుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆశ ,హరిత, సిహెచ్ఓ సుబ్బారావు మరియు అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ్ పక్వాడ

విశాలాంధ్ర -చీమకుర్తి: పోశం పక్వాడ కార్యక్రమాన్ని 8 నుండి 22వ తేదీ వరకు రెండో రోజు కార్యక్రమంలో చీమకుర్తి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల యందు,స్థానిక ప్రజాప్రతినిధులు సహకారంతో అంగన్వాడీ కార్యకర్తలతో నిర్వహించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో తీవ్ర లోప పోషణ కలిగిన పిల్లలు, హైరిస్క్ గర్భవతులు, రక్తహీనత ఉన్న కిశోర బాలికలను గుర్తించడం జరిగింది. చీమకుర్తి నగరంలో విద్యానగర్ రెడ్డి బజార్ గాంధీనగర్ రాంనగర్ సచివాలయాల పరిధిలోగల 20 మంది శ్యాం,మ్యామ్ పిల్లలను గుర్తించి వారి గృహములను సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ఆహార అలవాట్లు ఆరోగ్యంగా ఉండే పద్ధతులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకొనుటలో కలుగు ప్రయోజనాలు వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కే. ప్రమీల, ఆర్.పిచ్చమ్మ, కె.దేవసేన, అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ బేబీ రాణి, ఏవో శ్రీనివాస్, నాలుగు సచివాలయాల జీయం ఎస్కేలు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు ఆయాలు , తల్లుల మండల స్థాయి అధికారుల సమన్వయంతో నిర్వహించారు.

బాలింతలు పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఎంపీడీవో డి పేర్కొన్నారు. సురేష్ బాబు సంతనూతలపాడు సచివాలయం1,2 పరిధిలలోని గర్భవతులు బాలింతలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంత నూతలపాడు ఎంపీడీవో డి. సురేష్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం గర్భవతులకు బాలింతలు చిన్నారులకు అందించే పోషక విలువలతో కూడిన పదార్థాలను సద్వినియోగపర్చుకోవాలని వారిని కోరారు. ఈ నెల 22వ తేదీ వరకు మండలంలోని అన్ని కేంద్రాల్లో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు పినాగలక్ష్మి ఆర్ పార్వతి బాయ్ మెడికల్ ఆఫీసర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలను కాపాడుకోవాలి

బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి పిడతల రమేష్ రెడ్డి, సూరం నారాయణరెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి పిడతల రమేష్ రెడ్డి, సూరం నారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు సహకరించి పేదలకు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సేవ చేయడానికి కూడా ముందుకు రావాలని కోరారు.అదేవిధంగా జ్యోతి క్షేత్రంలోని కాశినాయన ఆశ్రమంలో కూడా అటవీ శాఖ అధికారులు జ్యోతి క్షేత్రంలోని బిల్డింగులు పడగొట్టారు అవి ఎందుకు పడగొట్టారు అనేది ఇప్పటికి ప్రజలకు అర్థం కాకుండా ఉందన్నారు. లక్షలాది మందిని ఉత్పన్నం చేసిన గొప్ప మహానుభావులని శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయనను కొనియాడారు. ఈ సందర్భంగా దాత మూరం స్వామి రంగారెడ్డి వారి తల్లి మూరం రామచంద్రమ్మ (లేట్) వారి జ్ఞాపకార్థం శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమము గిద్దలూరు లో పేదలు నిరుపేదలు సామాన్యులు కాశినాయన దర్శనానికి వచ్చే భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు 6500 ఒక్క రోజు భోజనం ఖర్చుకు ఇచ్చారు. భోజనం చేసిన భక్తులు మూరం స్వామి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మొరం స్వామి రంగారెడ్డి మాట్లాడుతూ కాశినాయన ఆశ్రమాల దగ్గర భోజనం ఏర్పాటు చేయడం పేదలకు కడుపు నింపడం చాలా పుణ్య కార్యక్రమము అని తెలిపారు అలాగే కాశినాయన ఉన్నప్పుడు గిద్దలూరులో ఎక్కువ కనపడే వారన్నారు కాశినాయన పురాతన దేవాలయాలన్నీ బాగు చేసి ఆలయాల్లో భోజనం ఏర్పాటు చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణ రెడ్డి సంఘసేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు, వేమన తపోవనం వ్యవస్థాపకులు పూనూరు హనుమంత రెడ్డి, సర్వేయర్ రెడ్డి మల్లారెడ్డి, విశ్రాంత లెక్చరర్ వడ్డే వీరారెడ్డి, విశ్రాంత ఆర్టీసీ కంట్రోలర్ వెంకటేశ్వర్లు,మీనిగ శివ రంగారెడ్డి పంట శివ మల్లారెడ్డి టీ కొట్టు నారాయణమ్మ చిల్లర కొట్టు యజమాని లక్ష్మీదేవి, గాయత్రి భక్తురాలు వంగళ ప్రసూన అమ్మయ్య, రమణ వాల్మీకి దుగ్గా రాజశేఖర్ రెడ్డి హెల్త్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యకర్త పంట శివమల్లారెడ్డి, విశ్వహిందూ పరిషత్ మార్కాపురం జిల్లా ఖండ పాలేరు బ్రహ్మానందరెడ్డి, వెంకట్ రెడ్డి రామకృష్ణ భక్తులు, గాయత్రి మాత భక్తులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ భక్తులు, కాశినాయన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రభ తడిక నిధిలోకి చేరిక





విశాలాంధ్ర -చీమకుర్తి : చీమకుర్తిలో రామతీర్థ గంగమ్మ తిరునాళ్ల సందర్భంగా 11,12 తేదీల్లో జరగబోయే రామతీర్థ గంగమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభ తడికను బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి కళ్యాణ మండపం నుండి మేళ తాళాలతో డప్పు సప్పుల తో రంగ రంగ వైభవంగా ప్రభతడికను నిధిలోకి చేర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ , వైఎస్ఆర్సిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు,దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. వారు గుర్రంపై మరియు కాలినడకన రామ తీర్థం వరకు ప్రయాణించి ప్రభను నిధిలోకి చేర్చారు. ఈ కార్యక్రమానికి చీమకుర్తి మండల వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడమే నా లక్ష్యం అని సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ అన్నారు. ఒంగోలులోని తనకార్యాలయం నందు బుధవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంనికి సంతనూతలపాడు చీమకుర్తి మద్దిపాడు నాగులుప్పలపాడు మండలాల నుండి ప్రజలు తమ సమస్యలకు సంబంధించి 30 అర్జీలు వచ్చాయి అయితే ప్రజా సమస్యలు ఆసక్తిగా విని పరిష్కారం చేయటంలో ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్, భగవద్గీతలు ఆవిష్కరణ

విశాలాంధ్ర - కనిగిరి: ప్రభోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రైత సిద్ధాంత కర్త ప్రభోధానంద ఆచార్య యోగీశ్వరుల దివ్యాశీస్సులతో రూపొందించిన త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ తో పాటు త్రైత సిద్ధాంత భగవద్గీత ను కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభోధ సేవాసమితి సభ్యులు జి. ప్రసాద్, జి.పెంచెల రత్నం, ఎం.కొండారెడ్డి, టి.మాలకొండారెడ్డి, వై.మహేంద్ర, డి.రమణయ్య, కె.వెంకటసుబ్బమ్మ, కె.వెంకటేశ్వరరెడ్డి, జి.తిరుపతయ్య, సీహెచ్.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com గురువారం 10 ఏప్రిల్ 2025

చండ్ర రాజేశ్వరరావు సేవలు మరువలేనివి

సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ

విశాలాంధ్ర - రేపల్లె : భారత స్వాతంత్ర్య సమరయోధుడు,ఉత్తమ కమ్యూనిస్టు,తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతాంగ,కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప కమ్యూనిస్టు ఉద్యమకారుడు అమరజీవి చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ అన్నారు.వేమూరు నియోజకవర్గ సీపీఐ సమితి ఆధ్వర్యంలో అమరజీవి చండ్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలోఆయన చిత్ర పటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ చండ్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా 28 సంవత్సరాల పాటు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి ఉత్తమ కమ్యూనిస్టుగా సేవలందించారన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో ముఖ్య పాత్ర పోషించి నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతుల, కార్మికుల హక్కుల కోసం ఉద్యమించారని తెలిపారు.చండ్ర రాజేశ్వరరావు అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడుగా రైతుల తరపున ఎన్నో పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. 1974లో సోవియట్ యూనియన్ అతనికి ఆర్డర్ ఆఫ్ లెనిన్ అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రధానం చేసిందని , కమ్యూనిస్టు ఉద్యమం సేవలకు గుర్తింపుగా లభించిందన్నారు.అంతర్జాతీయ కమ్యూనిస్టు గొప్పతనంతోసామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను శాంతి ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లారన్నారు.తన జీవితాన్ని పార్టీ శ్రేయస్సు కోసం ధారబోశారని,తన యావద్ ఆస్తి 400 ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారని కొనియాడారు. తను మృతి చెందితే దుస్తులు పేదవారికి పుస్తకాలు పార్టీ గ్రంథాలయాలకు అప్పజెప్పాలని వీలునామాలో పేర్కొన్నారన్నారు. మహామనిషి చండ్ర రాజేశ్వరరావు అని ఆశయ సాధనకై పార్టీ కార్యకర్తలు,నాయకులు ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. పేద,బడుగు,బలహీన వర్గాల కోసం ఉద్యమించి పేదలకు భూ పోరాటాల ద్వారా పంచిపెట్టారని బాలాజీ తెలిపారు. ఏఐవైఎఫ్ నాయకులు వి.శ్రీనివాసరావు, ఒబుల శెట్టి రమేష్, ఏఐటీయూసీ నాయకులు డి.నాగరాజు, కె. సత్య నారాయణ పాల్గొన్నారు.

రామచంద్రరావు కృషి అభినందనీయం

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంను ప్రతిరోజు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచటానికి శానిటరి ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు చేస్తున్న కృషి అభినందనీయమని పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు కొనియాడారు.పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రైలుపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద రేపల్లె మున్సిపల్ శానిటరి ఇనిస్పెక్టర్ రామచంద్రరావును ఆర్య వైశ్య నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కాశేపల్లి ఈశ్వరరావు,సెక్రటరీ తడికమళ్ళబాబు,వైస్ ప్రెసిడెంట్స్ పొన్నూరు శ్రీనివాసరావు,తుమ్మలపల్లి, కోశాధికారి తూనుగుంట్ల రాజేష్,సహ కోశాధికారి గుర్రం సురేష్,సుగ్గుల సుదర్శనరావు,ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

విశాలాంధ్ర - పిట్టల వానిపాలెం : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ ప్రమాదవశాత్తు కింద పడి గాయాలయ్యాయి. చందోలు ఎస్సై వెంకట శివ కుమార్ మానవత్వం చాటారు.ఈ సంఘటన చందోలు హైవే సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది.అందిన సమాచారం మేరకు అమృతలూరుకు చెందిన కంచర్ల శ్రావణి అమృతలూరు నుండి ఖాజీపాలెంకు ఫంక్షన్ నిమిత్తం ఆటోలో వెళ్ళింది.ఫంక్షన్ ముగించుకొని తిరిగి ఖాజీపాలెం నుండి అమృతలూరుకు ప్రయాణమైన క్రమంలో చందోలు హైవే సమీపంలో వచ్చే సరికి కంచర్ల శ్రావణి ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కింద పడిందీ.దీంతో ఆమెకు గాయాలయ్యాయి.వెంటనే సమాచారం అందుకున్న చందోలు ఎస్సై వెంకట శివకుమార్ తమ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయాలపాలైన మహిళకు వైద్య చికిత్స అందించేందుకు 108 అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్ లక్ష్యం

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. బుధవారం వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నెలలో ప్రతి బుధవారం మండలాల వారీగా ప్రతి మండలంలో పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమన్నారు. అదే రీతిలో నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేయడం జరుగుతుందని తెలియజేశారు.కార్యక్రమంలో తాసిల్దార్ సుశీల, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు,ఈఓఆర్డి శేఖర్ మండలంలోని వివిధ శాఖల అధికారులు,టిడిపి నాయకులు విజయబాబు,జనసేన పార్టీ నాయకులు ఊస రాజేష్,అమ్మి శెట్టి కిషోర్,షేక్ హనీఫ్,మన్నే పసి,బందారు సూరిబాబు,చావలి సర్పంచ్ శ్రీనివాసరావు,చంపాడు సర్పంచి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి లంకెవానిదిబ్బకి నూతన బస్ సర్వీసు ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె డిపో నుండి లంకెవానిదిబ్బకు పెనుమూడి, చాట్రగడ్డ, పిరాట్లంక,గంగడిపాలెం మీదగా రేపల్లె డిపో నుండి నూతన సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు రేపల్లె డిపో మేనేజర్ సుశీల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లెలో ఉదయం 5.30,9.30 సాయంత్రం 6.10లకు బయలుదేరునని తెలిపారు. తిరిగి లంకెవానిదిబ్బలో ఉదయం 7,11రాత్రి 7:40లకు బయలుదేరునని తెలిపారు.ప్రస్తుతం నదుస్తున్న రేపల్లె లంకెవానిదిబ్బ నల్లూరుపాలెం, తుమ్మల, మోళ్ల గుంట,గంగడిపాలెం సర్వీస్ యధావిధిగా తిరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు.ఈ సర్వీస్ రేపల్లెలో ఉదయం 6.15,11 మధ్యాహ్నం 2.30, సాయంత్రం 6.15 (గంగడిపాలెం)వరకు,రాత్రి 9.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రేపల్లె డిపో మేనేజర్ సుశీల్ కుమార్ కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : బిజెపి నాయకులు,కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొండమూది బంగారు బాబు పార్టీ కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు.బుధవారం రేపల్లె భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీలక సభ్యుల సమావేశం జరిగింది.ఈ సమావేశంనకు ముఖ్యఅతిథిగా బాపట్ల జిల్లా బిజెపి అధ్యక్షులు కొండమూది బంగారు బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,అసెంబ్లీ కన్వీనర్ఇంకొల్లు మాణిక్యరావు,మత్స్యశాఖ సంక్షేమ బోర్డు డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు,రాంపల్లి జగన్నాథ శాస్త్రి , రేపల్లె పట్టణ అధ్యక్షులు వాకా శివరాంప్రసాద్,నగరం మండల అధ్యక్షులు జుజ్జువరపు సురేష్,బిజెపి సీనియర్ నాయకులు పిన్ని సాంబశివరావు, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు బేతపూడివెంకటేశ్వరరావు,పిన్నపాల సత్యసాయిబాబు,మొద్దు సురేష్,చార గుండ్ల కిషోర్,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మోర్ల కృష్ణప్రసాద్,నాగలీల,అన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రజాదర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఆయన మాట్లాడుతూ అర్హమైన వాటిపై విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్‌రావు,తెదేపా చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం,చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు,వేటపాలెం మండలం మహిళా అధ్యక్షురాలు యర్ర శివనాగ మల్లేశ్వరి,జనసేన నాయకులు కారంపూడి పద్మిని,బిజెపి నుండి తడవర్తి చంద్ర తదితరులు పాల్గొన్నారు.మొత్తం 150 అర్జీలు వచ్చినట్లు అందులో ఇళ్ల స్థలాలకు 80 అర్జీలు,పెన్షన్ కొరకు 45 అర్జీలు,రేషన్ కార్డుల కోసం 25 అర్జీలు వచ్చాయని తెలిపారు.

ప్రత్యేక పూజలు : కొత్తపేట పంచాయితీ లక్ష్మీ శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయం వద్ద నిర్వహించిన శ్రీరామ కళ్యాణ పట్టాభిషేక ఏకాంత సేవా మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కూటమి నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయుటకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.పేదల సేవ కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల అమలులో అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు.పర్చూరు నియోజవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, ప్రతి మండలంలో ఒక అంబేద్కర్ భవన నిర్మాణానికి,సబ్ స్టేషన్ల నిర్మాణానికి,గ్రావెల్ రోడ్ల ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.చినగంజాం మండలంలో కొత్త గొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో వ్యక్తిగత అవసరాలకు సంబంధించి పనులను ఆయా శాఖలకు తెలియజేయాలని,నిబంధనల మేరకు వాటిని పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా సామాజిక అవసరాలకు సంబంధించిన పనులను ఆయా శాఖలకు తెలియజేస్తూ వేరువేరుగా ఉత్తర్వులు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు.ఆ గ్రామంలో పి4 కింద ఎన్నిక కాబడిన కుటుంబాల అవసరాలను మార్గదర్శులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్డిఏను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,పిడి డిఆర్డిఏ కె.శ్రీనివాసరావు,ఏపీ సీపీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు,హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.